# 111. సిక్కులీవు - ట్రిక్కు లీవు, వగైరా

వెనకటికి ఒక ముసలాయన ఒక గవర్నమెంటాఫీసుకి వెళ్లి, అక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న పెద్దమనిషితో : "అయ్యా, నా పేరు ఎస్.రాజశేఖరం. మా మనవడు - నా పేరింటికాడే! ఈ ఆఫీసులో పనిచేస్తున్నాడు. వాడి సీటు ఎక్కడో చెప్తారా?" అని అడిగితే; మేనేజరు పక్కన నిలబడి ఏదో ఫైలు మీద ఆయన సంతకం కోసం ప్రయత్నిస్తున్న ఒక పెద్దమనిషి:

"సారీ అండీ, మీ మనవడు మీ అంత్యక్రియలకి వెళ్లాలని ఇవాళ సెలవు పెట్టేడు." అని చెప్పేడట.

నా మిత్రుడు చలపతిరావు ఒకరోజు తనకి కడుపులో నెప్పిగా ఉందని సెలవుచీటీ రాసి, ఆ వీధి గుండా అదే ఆఫీసుకి వెళ్లే ఒక సహాధ్యాయితో ఆఫీసుకి పంపించాడు. చలపతిరావు రాసిన లీవు లెటరు చూసి వాళ్ల మేనేజరు -

"అయ్యో, చలపతికి కడుపునెప్పా, పాపం! ఎలా వున్నాడు, మీరు చూసేరా?" అని లీవు లెటరు తెచ్చినతన్ని అడిగాడు.

"ఏమోనండీ, ఇప్పుడెలా వుందో; అపెండిసైటిస్ అని అనుమానంగా వుందిట. నేను చూసేసరికి నెప్పితో లుమ్మచుట్టుకుపోతూ కనిపించేడు!" అని జవాబు.

చలపతిరావు లీవు వెంటనే గ్రాంటయింది. అయితే మేనేజరుగారు ఆ కాగితం మీద "గ్రాంటెడ్" అని రాసేడంతో తన బాధ్యత తీరిపోదనీ, చలపతిరావు మీద తనకున్న అభిమానం మరింత గాఢంగా వ్యక్తపరచాలనీ అనుకున్నారు.

(ఇలాంటి సన్నివేశంలోనే ఇంకో ఆఫీసరు వెంటనే థర్మామీటరూ, బీ.పీ. ఏపరేటస్సూ పుచ్చుకుని ఆ క్లర్కుగారింటికి వెళ్లేడని; "జరం లేదు గిరం లేదు; రా, జీపు ఎక్కు; ఆఫీసుకి పోదాం" అన్నాడనీ 'బాపు' గారిది ఒక కార్టూను వుంది.)

చలపతిరావు ఉంటున్న ఇంటి పొరుగున ఒక ఫోను ఉంది. ఎప్పుడైనా ఎమర్జన్సీ వస్తే ఉపయోగించొచ్చునని ఆ నెంబరు నోట్ చేసుకున్న మేనేజరుగారు వెంటనే ఆ నెంబరు పిల్చారు. "అయ్యా; నాపేరు ధర్మరాజు. మీ పొరుగింట్లో వుంటున్న చలపతిరావు ఆఫీసు మేనేజర్ని. మా చలపతిరావుకి  కడుపునొప్పి అని తెలిసింది. శ్రమ అనుకోకుండా ఒకసారి అటువెళ్లి అతనికి ఇప్పుడు ఎలా వుందో  కనుక్కొని చెప్తారా?" అని అడిగారు.

"ఓ, ష్యూర్, లైన్లో వుండండి!" అని ఒక జవాబు; రెండు నిమిషాలు గడిచాక మరో జవాబు వచ్చేయి. "హలో! చలపతిరావుగారి సంగతి అడిగేరు కదా; ఏమిట్రైందో గానండీ; ఇంటి నిండా బంధువులున్నారండి. ఒకటి రెండుసార్లు కాలింగ్ బెల్ మోగించేను గానండీ; ఎవరూ రాలేదండి ఇవతలికి."

"అయ్యో, అయ్యో!" అని మేనేజరుగారు అసిస్టెంటు డైరక్టరుగారికి చెప్పి జీపు తీసుకు బయల్దేరారు. అయితే ఆయన వెళ్ళేసరికి చలపతిరావు తన ఇద్దరు చెల్లెళ్లతో, బావగార్లతో కబుర్లు చెప్తూ "కడుపు పగిలేటట్టు" నవ్వుతూ కనిపించేడు.

సిక్కులీవు అంటే "సిక్కులు" అడిగే లీవు కాదు. "జబ్బు చేసింది" అనే కారణం (సాకు) పెట్టి అడిగిన సెలవు అని అర్థం.

నేను కొంతకాలం డిప్యుటేషను మీద పనిచేసిన ఒక సంస్థలో సిక్కులీవు రెండు రకాలు ఉండేది.

"ప్రయివేటు సిక్కు", "కంపెనీ సిక్కు" అని ఆ రెండు సిక్కుల పేర్లు. కంపెనీకి ఆరు కాలనీలు వుంటే ఆరింట్లోనూ ఆరు డిస్పెన్సరీలు ఉన్నాయి. ఎవరికైనా సుస్తీ చేస్తే కాలనీలోనే ఆస్పత్రి అందుబాటులో వుండేది. అంచేత కంపెనీ క్వార్టర్సులో ఉండే ఉద్యోగి ఎవరయినా సిక్కు లీవు పెట్టాలంటే కంపెనీ డాక్టరు దగ్గిరే సిక్కు సర్టిఫికేటు తీసుకోవలసిన అవసరం ఉండేది.

ఈ సంగతి నాకు తెలియక ఓసారి శలవు అవసరం వస్తేను, టవున్లోకి వెళ్లి బాగా ఎరిగున్న ఒక డాక్టరుగారి దగ్గిర సర్టిఫికెట్టు తీసుకుని సిక్కు లీవు అడిగాను. దానిమీద మా సూపరుగారు (సూపరింటెండెంటు గార్ని సూపర్‌గారనే అనే వాళ్లం.) "ఇతను ఫలానా కోలనీలో నివాసం ఉన్నాడు. ఆ కోలనీలో కంపెనీ ఆస్పత్రి, మెడికల్ ఆఫీసరు ఉండగా కూడా ఇతను వేరే డాక్టరు వద్ద సర్టిఫికెట్టు తీసుకున్న సంగతి దృష్టికి తేవడమైనది" అని రిమార్కు రాశాడు. దాంతో నేను సంజాయిషీ ఇచ్చుకోవలసి వచ్చింది. అయితే "శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు" అన్నారు. అందులో భాగంగా నా సంజాయిషీ ఇలా నడిచింది : "అయ్యా, ఆ రోజు ఉదయం లేచేసరికి నాకు ఒళ్లంతా అదోలా అయిపోయి, గాభరా పుట్టించింది; నా శరీరం మీద నాకన్నా మా ఆవిడకి ఆందోళన ఎక్కువ కదా, అంచేత ఆవిడ కోలనీలో ఫలానా ఆఫీసరు గారింటికి వెళ్లి మా అభిమాన డాక్టరుగారికి ఫోన్ చేసి వెంటనే రమ్మని ప్రార్థించింది. ఆయన వచ్చి చికిత్స మొదలెట్టి, మందులు కూడా శాంపిల్సు లోంచి ఇచ్చి సిక్కు సర్టిఫికేటు కూడా రాసి ఇచ్చేరు. మన కోలనీలో ఆస్పత్రి అయితే ఉంది కాని అది ఉదయం తొమ్మిదిన్నర వరకూ తెరవరు. పైగా డాక్టరుగారు వచ్చేసరికి పదిగంటలు దాటుతుంది. అప్పుడయినా క్యూలో కూర్చుని వున్న నన్ను ఆయన పరీక్షించేసరికి పదకొండు దాటుతుందని-"

(నా సెలవు గ్రాంటయిందని వేరే చెప్పక్కర్లేదు కదా.)

నేను సర్వే డిపార్టుమెంట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ వుండినప్పుడు జరిగిన ఒక చిత్రమైన ఉదంతం వివరిస్తాను.

అతని పేరు అర్జునరావు. మంచి వర్కరు. అలాంటి వాడు సెలవులో వెళిపోతే "లక్ష్యాలు" (టార్గెట్స్) దెబ్బతింటాయి. అందుకని అతను ఎప్పుడు సెలవు అడిగినా పై అధికార్లకి పంపకుండా నేనే నొక్కేస్తూ ఉండేవాడిని.

ఒకసారి సంక్రాంతి పండగ ఇరవై రోజులు ఉందనగా హెడ్డాఫీసు నుంచి నాకు ఒక కాగితం వచ్చింది. అది పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక పల్లెటూరి నుంచి ఒక (అంతగా చదువుకోని) స్త్రీ రాసింది. "అయ్యగారూ; దండాలండి. నా బర్త అరిజన్‌రావు మీ కింద పనిజేత్తాడండి. మాకు పెల్లయి ఏడాదవ్విందండి. నన్ను ఇక్కడే ఒగ్గేసి ఎల్లాడండి. ఇల్లుజూసి ఉత్తరం ఏత్తానన్నాడండి. ఇంక అదే కబురండి. మావోల్లేమో, అక్కడ నా బర్త వేరే ఎవుర్నో మనువాడాడని అంటన్నారండి. రమ్మని ఉత్తరం ఏత్తేనండి, సెలవు లేదని రాసినాడండి. నా బర్తని ఎలాగో ఇక్కడికి పంపిత్తే అన్నీ మొగం మీద అడిగేత్తానండి. నాకాపరం నిలబెట్టండి, అయ్యగారండి!"

ఈ కాగితం మార్జిన్‌లో మా ఆఫీసర్‌గారు : శ్రీ అర్జున్‌రావు ఈజ్ గ్రాంటెడ్ వన్‌మంత్ లీవ్. టేక్ అప్లికేషన్ అండ్ రిలీవ్ హిం ఇమీడియట్లీ" అని రాసి సంతకం పెట్టి నాకు పంపేరు. కింది ఉద్యోగులకు సెలవు మంజూరు చెయ్యడంలో నాకన్నా కర్కోటకుడు మా ఆఫీసరు. ఆయనే అర్జునరావుకి ఒక నెల సెలవు ఇచ్చేశారంటే - ఇంక చేసేదేముంది!

అర్జునరావు శలవు అయిపోయాక మళ్లా డ్యూటీకి వచ్చేక తెలిసింది. అది కాజువల్ లీవు కాదు, సిక్ లీవు కాదు; "ట్రిక్-లీవు" అని! ★